



నచ్చిన మిల్లుకే ధాన్యం

- ఈ ఏడాది ధాన్యం సేకరణలో మార్పులు
- లక్ష్యం.. 3.20 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు ప్రక్రియ కూడా ప్రారంభం

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి)

ధాన్యం సేకరణలో ఈసారి ప్రభుత్వం అన్నదాతలకు అనుకూలమైన మార్పులు చేసింది. పంటను తనకు నచ్చిన మిల్లుకు అందజేసే వెసులుబాటు కల్పించింది. ముందస్తుగా కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వైసీపీ హయంలో అధికారులు చెప్పిన మిల్లులకే రైతులు ధాన్యం తీసుకువెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడేవారు. కొందరు దూరం ప్రాంతంలో ఉన్న మిల్లులకు వెళ్లాల్సి వచ్చేది. తీరా అక్కడకు వెళ్లాక చాంతాడు క్యూ ఉండేది. ట్రాక్టర్ లోడును అన్‌లోడ్ చేయడానికి రోజుల కొద్దీ సమయం పట్టేది. అందుకు ఖర్చులు తడిసిమోపెడయ్యేవి. ఈసారి అలా కాకుండా రైతుకు నచ్చిన మిల్లుకు నేరుగా రైతు సేవా కేంద్రం నుంచి ధాన్యం తీసుకువెళ్లే వెసులుబాటు కల్పించింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ మొదలైంది. ఈ ఏడాది రైతుల నుంచి 507 రైతు సేవా కేంద్రాల ద్వారా పంట సేకరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 80లక్షలు గోనె సంచులు అవసరమని అధికారులు నిర్ణయించారు. 135 మిల్లుల నుంచి రూ.250 కోట్లు బ్యాంకు గ్యారెంటీలు తీసుకోనున్నారు. సాధారణ రకం క్వింటా వద్ద రూ.2300 చొప్పున చెల్లించనున్నారు. దీనికి అదనంగా హమాలీ చార్జీల కింద ప్రతి క్వింటాకు రూ.17.17 చెల్లిస్తారు. గోనె సంచులను పౌర సరఫరా సంస్థ అందిస్తుంది. ఒక వేళ రైతులు ఏర్పాటు చేసుకుంటే 40 కేజీల సంచికి రూ.3.39 చెల్లిస్తారు. ధాన్యం రవాణా చేసేందుకు జీపీఎస్ అమర్చి ఉన్న వాహనాలనే అనుమతిస్తారు. రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. రైతులు ధాన్యం విక్రయించిన సమయంలో ఎఫ్‌టివో అథంటికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.



జొన్నవలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ సేతు మాధవన్ (ఫైల్)

ఇంకా అందని రవాణా.. హమాలీ చార్జీలు

2021-22 ఖరీఫ్ సీజన్‌లో 76 వేల మంది రైతుల నుంచి 4 లక్షల 21 వేలు మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించారు. బిల్లులైతే చెల్లించారు కాని హమాలీ, రవాణా చార్జీలు మాత్రం అందజేయలేదు. ధాన్యం సేకరించినందుకు పీఏసీఎస్‌లు(పాక్స్), గిరి మిత్ర, ఇందిర క్రాంతి పథం సంఘాలకు కమీషన్ రూపంలో ఐదు విడతలుగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ నుంచి రూ.9కోట్లు ఉమ్మడి జిల్లాకు విడుదలయ్యాయి. వాటిలో క్వింటాకు రూ.33 కమీషన్ కాగా సుమారు ఆరు రూపాయల వరకూ తాత్కాలిక సిబ్బంది జీతాలకు, వివిధ పరికరాలు కొనుగోలుకు కేటాయించాలి. మిగిలిన రూ.27 హమాలీ చార్జీలు చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. అప్పట్లో చాలా మంది రైతులు సొంతంగా హమాలీ చార్జీలు పెట్టుకున్నారు. హమాలీ చార్జీలతో పాటు రవాణా చార్జీలు అందజేయాలని అనేకసార్లు రైతులు డిమాండ్ చేస్తూ వచ్చారు. వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.





జెట్టీ కలేనా?

- సంవత్సరాలుగా మత్స్యకారుల ఎదురుచూపులు
- ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస
- అక్కడ ఎన్నో కష్టాలు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న జెట్టీ నిర్మాణం రెండు మండలాల మత్స్యకారులకు కలగా మిగులుతోంది. జెట్టీ ఉంటే స్థానికంగా ఉపాధి దొరుకుతుందన్న మత్స్యకారుల ఆశ నెరవేరడం లేదు. ఆర్థిక కష్టాలకు తాళలేక చాలా మంది మత్స్యకారులు కుటుంబాల సమేతంగా వలసబాట పడుతున్నారు. గుజరాత్, మహారాష్ట్ర, పారాదీప్ ప్రాంతాలకు వెళ్లి అక్కడ చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారు.

పూసపాటిరేగ, నవంబరు17 (ఆంధ్రజ్యోతి)

కొన్నేళ్లుగా పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన మత్యకారులు జీవనోపాధికోసం దేశంలో వివిధ ప్రాంతాలకు వలసపోతున్నారు. ఇక్కడ జెట్టీ ఏర్పాటు చేయాలని సంవత్సరాలుగా విన్నవించుకొంటున్నా స్పందన లేకపోవడంతో పొట్ట చేత పట్టుకుని పయనమవుతున్నారు. వైసీపీ ప్రభుత్వం మత్యకార భరోసా ప్రకటించిన సమయంలో నాటి ముఖ్యమంత్రి జగన్ చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత అధికారులు పలుమార్లు వచ్చి స్థల పరిశీలన చేయడమేగాని నిర్మాణం వైపుగా అడుగు పడలేదు. మండలంలో కోనాడ పంచాయతీకి చెందిన మత్యకార గ్రామమైన బీజీపేట నుంచి అత్యధికంగా మత్స్యకారులు వలస వెళ్లిపోయారు. ఈగ్రామంలో వృద్ధులు, పిల్లలు తప్ప పెద్దగా ఎవ్వరూ కానరారు. అందరూ జీవనోపాధి కోసం విశాఖ, పారదీప్, గుజరాత్ తదితర ప్రాంతాలకు తరలిపోయారు. గ్రామ జనాభా సుమారు 600 మందికి పైగా ఉన్నా పట్టుమని 100 మంది కనిపించరు. పాఠశాలలో కూడా పట్టుమని 15 మంది పిల్లలు లేరు. కొన్నిసార్లు సొంతవారు మరణించినా కడచూపు కరువైన సందర్భాలు కోకొల్లలు. మండలంలో మత్యకార గ్రామాలైన చింతపల్లి, తిప్పలవలస గ్రామాల్లో తప్ప మరేగ్రామంలోనూ మూడో వంతు ప్రజలు ఉండరు. అయితే చింతపల్లిలో జెట్టీ నిర్మాణం జరిగితే వారంతా సొంత గ్రామాల్లోనే ఉండి జీవనోపాధి పొందే అవకాశం ఉంటుంది. గతంలో కేంద్ర మత్స్యకారశాఖ మంత్రిగా ఉన్న పురుషోత్తం రూపాలా చింతపల్లివచ్చి త్వరలోనే జెట్టీ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. పనులు ముందుకు కదలలేదు. కూటమి ప్రభుత్వం జెట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మత్యకారులు, నాయకులు కోరుతున్నారు.

జెట్టీ నిర్మాణం చేపట్టాలి..



జెట్టీ నిర్మిస్తే జిల్లాలో మత్స్యకారులంతా స్థానికంగా జీవనోపాధి పొందే అవకాశం ఉంటుంది. వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేకశ్రద్ధ కనబరిచినట్లయితే వందలమంది మత్యకారులకు జీవనోపాధి దొరుకుతుంది.

-దంగా భూలోక, కోనాడ, మత్స్యకార నాయకులు

వేర్వేరు ప్రాంతాల్లో కొడుకులు



నాకు ముగ్గురు కొడుకులు. చేపల వేటే వారికి జీవనాధారం. జీవనోపాధి కోసం ముగ్గురు కొడుకులు వృద్ధాప్యంలో ఉన్న నన్ను వదిలి వెళ్లిపోయారు. ఇక్కడే జెట్టీ ఉంటే మాతోపాటే మాగ్రామంలో ఉండేవారు.

-దంగా దానయ్య, బీజీపేట, మత్స్యకారుడు

నాకు ఆధారం లేదు..

నేనే దివ్యాంగుడిని. ఏ ఆధారం లేకుండా పోయింది. జీవనోపాధికోసం నా కుమారులు వేరేప్రాంతాలకు వెళ్లిపోయారు. జీవనం కష్టంగా ఉంది.

-బొడ్డు సత్తయ్య, మత్స్యకారుడు



గ్రామస్థుల వలసతో ఖాళీగా బీజీపేట

గ్రేడు-2 లైన్‌మన్లకు మంచి రోజులెప్పుడో?

- ఐదేళ్ల కిందట నియామకం
- పెరిగిన పని ఒత్తిడి
- సౌకర్యాలు అంతంతమాత్రం
- రెండు శాఖల మధ్య నలిగిపోతున్నామని ఆవేదన
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

వారు క్షేత్రస్థాయిలో విద్యుత్ పరికరాల మరమ్మతులు చేపడుతుంటారు. ఎప్పటికప్పుడు ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపుతుంటారు. నిరంతరం అందుబాటులో ఉంటారు. ఐదేళ్ల కిందట నియామకమైన వీరు ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయారు. వారే ఎనర్జీ అసిస్టెంట్లుగా పిలిచే గ్రేడ్-2 లైన్‌మన్లు. పెరిగిన పని ఒత్తిడితో రెండు శాఖల మధ్య నలిగిపోతున్నామని వాపోతున్నారు.

రాజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):

2019 అక్టోబరు 2న వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలో భాగంగా ఎనర్జీ అసిస్టెంట్లను నియమించింది. ఐటీఐ ఎలక్ట్రానిక్ పూర్తిచేసిన అభ్యర్థులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసింది. వీరు ఉద్యోగాల్లో చేరి ఐదేళ్లవుతున్నా మిగతా ఉద్యోగుల మాదిరిగా రాయితీలు, ఇతరత్రా సౌకర్యాలు దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 777 పంచాయతీలు ఉన్నాయి. 530 సచివాలయాలు కొనసాగుతున్నాయి. అప్పట్లో సచివాలయానికి ఒకరు చొప్పున ఎనర్జీ అసిస్టెంట్లు (గ్రేడ్ 2 లైన్‌మన్లు)ను నియమించారు. వీరి విషయంలో ఇప్పటికీ అస్పష్టత కొనసాగుతోంది. వీరు సచివాలయం పరిధిలో పనిచేయాలా? లేకుంటే విద్యుత్ శాఖ పరిధిలోనా అన్నది స్పష్టత ఇవ్వలేదు. దీంతో రెండువైపులా నలిగిపోతున్నారు. అటు సచివాలయ ఉద్యోగులకు అందుతున్న ప్రయోజనాలు కాని.. ఇటు విద్యుత్ శాఖ ప్రయోజనాలు కాని పొందలేని దయనీయ స్థితిలో ఉన్నారు.



జిల్లాలో 530 సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్స్ (గ్రేడ్-2 లైన్‌మెన్లు) పనిచేస్తున్నారు. వీరంతా ఐటీఐ పూర్తిచేసిన వారే. జిల్లా సెలక్షన్స్ కమిటీల ద్వారా ఎంపికయ్యారు. శారీర దారుడ్య పరీక్షలతో పాటు స్తంభం ఎక్కడం, సైకిల్ తొక్కడం వంటి వాటిలో నైపుణ్య పరీక్ష నిర్వహించి ఎంపిక చేశారు. వారం, పదిరోజుల పాటు శిక్షణను ఇచ్చి సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లుగా నియమించారు. వీరికి వృత్తిపరమైన శిక్షణ ఇవ్వలేదు. సాధారణంగా విద్యుత్ శాఖ అంటే ప్రమాదకరమైనది. కానీ వీరికి అత్తెసరు శిక్షణనిచ్చి విధుల్లో నియమించడంపై రకరకాల విమర్శలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. అయితే వీరు సచివాలయం పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉన్నా.. విద్యుత్ శాఖ నియంత్రణలో పనిచేయాల్సి వస్తోంది. విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత వీరిపై ప్రభావం చూపుతోంది. సచివాలయం దాటి పదుల సంఖ్యలో గ్రామాల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. కొన్నిమండలాల్లో లైన్‌మెన్లు లేకపోవడంతో అయినదానికి.. కానిదానికి వీరే స్పందించాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొందరు ప్రమాదాల్లో బాధితులుగా మిగులుతున్నారు.

వారి డిమాండ్లు

సచివాలయ ఉద్యోగులందరికీ ప్రొబేషన్ డిక్లరేషన్ అయ్యింది. ఎనర్జీ అసిస్టెంట్ల విషయంలో ఎటూ తేల్చలేదు. అటు 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించడం లేదు. సచివాలయాల జాబ్ చార్టు కూడా అమలు చేయడం లేదు. సెలవులకు సంబంధించి సీఎల్, ఈఎల్, మెడికల్, ఇతరత్రా సెలవులేవీ వీరికి దక్కడం లేదు. ఈహెచ్ఎస్ హెల్త్‌కార్డులు కూడా జారీ కావడం లేదు. మిగతా సచివాలయం ఉద్యోగుల మాదిరిగా వేతనాలతో పాటు గుర్తింపునివ్వాలని గత నాలుగు సంవత్సరాలుగా కోరుతూ వస్తున్నారు. కానీ అరణ్యరోదనగా మిగిలింది.

సమస్య ఉంటే మా దృష్టికి తెస్తారు

సచివాలయం పరిధిలో నియమించిన గ్రేడ్-2 లైన్‌మన్‌లు ఏదైనా మేజరు సమస్యలు ఉంటే మాదృష్టికి తీసుకు వస్తారు. వారు మాత్రం మా కంట్రోల్‌లో ఉండరు. సచివాలయం పరిధిలోనే ఉంటారు. బిల్లుల జారీలో సమస్యలున్నా.. కొత్తగా మీటర్లు కావాలన్నా.. కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నా మా దృష్టికి తీసుకువస్తారు.

- కుమార్, ఏఈ విద్యుత్ శాఖ

కలిసిరాని పత్తి

- క్వింటా రూ.6450కే అమ్మకం
- కొనుగోలు కేంద్రాల్లో ధర రూ.7520
- దళారులదే రాజ్యం

రామభద్రపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు దళారుల వ్యూహానికి చిక్కి గిట్టుబాటు ధరకు నోచుకోవడం లేదు. రామభద్రపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఏటా పత్తిపంట సాగుచేస్తున్న రైతులకు చివరికి నష్టాలే మిగులుతు న్నాయి. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా రైతులు పంటను అప్పగించే పరిస్థితి లేదు. చెల్లింపులు ఆలస్యం అవుతాయన్న భయం.. పంటను నిల్వ చేసుకునే సామర్థ్యం లేక పత్తిని వ్యాపారులకే విక్రయించి సరైన గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు.

రామభద్రపురం, బాడంగి, సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ, తెర్లాం, దత్తిరాజేరు తదితర ప్రాంతాల్లో ఈ సీజన్‌లో ఏటా సుమారు లక్షా 50 వేల క్వింటాళ్ల పత్తి విక్రయాలు జరుగుతాయి. కొనుగోలు కేంద్రాలకు ప్రత్తి విక్రయించడం వల్ల పేమెంట్లు ఆలస్యం అవుతాయని రైతులు భావిస్తున్నారు. దళారులు ఇదే విషయాన్ని వారికి నూరిపోస్తుంటారు. అదే సమయంలో పంటను ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే సామర్థ్యం రైతులకు లేదు. వర్షాలు వస్తే ఉన్న పంట అంతా పోతుందన్న భయంతో వచ్చిన ధరకు పంటను అప్పగిస్తున్నారు. ఈ ఏడాది పత్తిరేటు మార్కెట్‌లో అధికంగా ఉండడంతో వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారే తప్పా రైతులు మాత్రం చాలీచాలని డబ్బులతోనే సరిపెట్టుకుంటు న్నారు. క్వింటా పత్తి మార్కెట్ రేటు రూ.6450 ఉంది.

కొనుగోలు కేంద్రాల్లో నాణ్యమైన ప్రత్తిని రూ.7520లకు కొనుగోలు చేస్తున్నారు. అయితే పంటలో ఆ స్థాయి నాణ్యతను అధికారులు నిర్ధారించడం లేదు. నాణ్యత బాగాలేదంటూ తక్కువ ధర ఇస్తున్నారనేది రైతుల భావన. అందుకనే పంట పొలం వద్దకు వచ్చే వ్యాపారులకే పంటను అప్పగిస్తున్నారు. వ్యాపారులు రైతులకు క్వింటా వద్ద రూ.6450 ఇచ్చి బయట మిల్లులకు రూ.8వేలకు పైగా అమ్ముతున్నారు.



విషాదం

- శుభ కార్యానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- మహిళ మృతి
- భర్త, మరిది పరిస్థితి విషమం

7లో

ఆనందంగా సాగిన వారి ప్రయాణం అంతలోనే విషాదమయమైంది. శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్తున్న వారికి రోడ్డు ప్రమాదం రూపంలో అంతులేని కష్టం ఎదురైంది. తాము ప్రయాణిస్తున్న ఆటో, కారును దాటుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో విశాఖ జిల్లా అక్కయ్యపాలెంకు చెందిన తోట లక్ష్మి(45) మృతి చెందింది. ఈమె భర్త తోట వెంకటరమణ, మరిది సన్యాసిరావుల పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన భోగాపురం మండలం పోలిపల్లి సమీప జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన 9 మంది కలిసి రాజాం సమీప నందబలగ గ్రామంలోని బారసాలకు వెళ్తున్నారు.

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 18 నవంబరు 2024



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝున్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!

బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్ని అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు
పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు...
అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.



అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్ని' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్ని' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్లుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లొకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, స్పై థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్


'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

కొత్తగా..

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'సక్క పోడు పోడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.



ఇన్‌చార్జితోనే..!

● భర్తీ కానీ రేగిడి హౌసింగ్ ఏఈ పోస్టు

● గృహనిర్మాణం వెనకడుగు



రేగిడిలో రెగ్యులర్ ఏఈలేని హౌసింగ్ కార్యాలయం

రేగిడి, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): మండలంలో హౌసింగ్ శాఖకు రెగ్యులర్ ఏఈ పోస్టు గత కొద్దినెలలుగా ఖాళీగా ఉంది. దీంతో హౌసింగ్ నిర్మాణాల ప్రగతి మందగిస్తుంది. గత ఆరునెలలుగా మండలానికి ఇన్‌చార్జి ఏఈలతో నెట్టుకొస్తున్నారు. ఆరునెలల క్రితం జగన్మోహనరావు రెగ్యులర్ ఏఈగా ఉండగా, ఈయన బదిలీపై వెళ్లిపోయారు. ఈలోగా కొత్త ప్రభుత్వం వచ్చినా హౌసింగ్‌కు రెగ్యులర్ ఏఈ కొరత తీరలేదు. మండలంలో వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన 2477 గృహనిర్మాణాలు, ఇంకా కొన్ని గ్రామాల్లో జగనన్న కాలనీలో ప్రగతి మందగిస్తుంది. ఇక్కడ రెగ్యులర్ హౌసింగ్ నిర్మాణాలు 60శాతం దాటనట్లు సమాచారం. జగనన్నకాలనీలో పెద్దలేఔట్‌గా ఉన్న ఉంగరాడ మెట్ట వద్ద 204 ఇల్లు మంజూరు కాగా కేవలం 70ఇళ్ల వరకే పూర్తికాగా, ఇంకా చాలా ఇళ్లు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇంకా తాజాగా టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన ఎన్టీఆర్ స్కీమ్‌లో దాదాపు 2వేల హౌసింగ్ నిర్మాణాలు బిల్లులు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా ఈఇళ్లకు సంబంధించిన సర్వే నత్తనడక సాగగా, ఇంకా సర్వేకు ఇళ్లు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా ఒకేఒక్క వర్కుఇన్‌స్పెక్టర్, పక్కమండల ఏఈలు ఈ బాధ్యతలు చూడటం కష్టతరంగా ఉంది. గతకొద్దినెలలుగా వంగర హౌసింగ్ ఏఈ పైడిరాజుకు ఈమండలం ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వగా, తాజాగా ఈయన బదిలీతో సంతకవిటి ఏఈ కనకయ్యకు ఇన్‌చార్జిగా అప్పజెప్పారు. ఈయన రెండు చోట్లు చూడటం తలకు మించిన భారంగా ఉంది. వాస్తవంగా జిల్లాలో భౌగోళికంగా అతిపెద్దమండలాల్లో రేగిడి ఒకటిగా ఉంది. ఇక్కడ 51 రెవెన్యూ గ్రామాలు, 25 సచివాలయాలతో కూడి 39 పంచాయతీల్లో విస్తరించి ఉంది. ఇటువంటి పెద్దమండలానికి రెగ్యులర్ ఏఈ అందుబాటు ఉంచాలని స్థానికులు, మండల ప్రజాప్రతినిధులు కోరుచున్నారు. హౌసింగ్ ప్రగతి నిర్మాణాలు పూర్తిపై ఇన్‌చార్జి ఏఈని ఆంధ్రజ్యోతి వివరణ కొరేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు అందుబాటు లేరు.

వైభవంగా కంచమ్మతల్లి విగ్రహం ప్రతిష్ఠ

గంట్యాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) మండలంలోని సిరిపురం గ్రామంలోని కంచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కనుల పండువగా ఆదివారం జరిగింది. జై కంచమ్మ తల్లి, జై జై కంచమ్మ తల్లి అంటూ భక్తులు నామస్మరణ చేశారు. సింహాచలానికి చెందిన పురోతులు రామ్మూర్తి పండితుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వేలాదిమంది భక్తుల నడుమ కార్యక్రమం అంగరంగ వైభవం సాగింది. దీంతో ఆయా ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది ప్రసాదం స్వీకరించారు. అమ్మవారిని జడ్పీటీసీ సభ్యులు వర్రి నర్సింహమూర్తి మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, పూనపాటిరేగ మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆకిరి ప్రసాద్‌రావు, సింహచలం మాజీ సర్పంచ్ పాసర్ల ప్రసాద్, మండల టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. పూజారి సిరిపురపు అబద్ధం, గ్రామపెద్దలు, గ్రామస్థులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన కంచమ్మతల్లి విగ్రహం

శుభకార్యానికి వెళ్తూ..

● ఆటో - కారు ఢీ ● మహిళ మృతి

● ఇద్దరి పరిస్థితి విషమం ● మరో ఐదుగురికి గాయాలు

భోగాపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా అక్కయ్యపాలేనికి చెందిన ఒక కుటుంబం ఆదివారం ఉదయం విజయనగరం జిల్లా రాజాం సమీపంలోని నందబంగకు ఒక శుభకార్యం కోసం ఆటోలో బయలుదేరారు. ఈ ఆటోలో తోట లక్ష్మి, తోట వెంకటరమణ, తోట సన్యాసిరావు, తోటరాజు, తోట రమేష్(ఆటోడ్రైవర్), తోట సుజాత, తోట తవుడమ్మ, పంతులు మూర్తి, చిన్న అబ్బాయి ఇలా మొత్తం 9 మంది నందబంగలో సమీప బంధువు కుమారిడి బారసాల కార్య క్రమం నిమిత్తం విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు జాతీయ రహ దారిపై నుంచి వస్తున్నారు. విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వైపు జాతీయ రహదారిపై ఆటోలో వెళ్తున్నారు. అయితే భోగాపురం మండలం పోలిపల్లి సమీప జాతీయరహదారిపైకి వచ్చే సరికి ముందు వెళ్తున్న కారును ఆటో ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించగా ఆటో కారుకి తగిలి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తోటలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా మృతురాలి భర్త తోట వెంకటరమణ, మరిది తోట సన్యాసిరావుకు తీవ్రగాయాలయ్యాయి. ఆటోలో ఉన్న మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గుర్తించి స్థానికులు వెంటనే గాయాలు పాలైన వారిని చికిత్స నిమిత్తం 108లో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ పి.సూర్యకుమారి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తోటలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భోగాపురం మండలం సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై ఎస్‌ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తోటలక్ష్మి (ఫైల్)

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆయా విషయమై మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖ వారిగా సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ శకుంతల తమ శాఖకు సంబంధించి మాట్లాడుతుండగా మదుపాడ గ్రామసర్పంచ్ పైడినాయుడు లేచి ఎన్ని పర్యాయాలు సమావేశానికి వచ్చినా కొత్త విషయాలు వెల్లడించడంలేదని, ఎప్పుడూ పాత విషయాలే చర్చిండం తదగని ప్రశ్నించారు. పురిటిపెంట, రామన్నపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న విషయాలు సమావేశంలో ఎందుకు సమావేశం ముందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఇందుకు సూపర్‌వైజర్ పురిటిపెంట అంగన్‌వాడీ కేంద్రంలోని అంగన్వాడీ పోస్టుకు సంబంధించి కోర్టు పరిధిలో ఉందని, రామన్నపేటలో ఆయావిషయం ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామన్నారు. దీంతో టీడీపీ నాయకురాలు రామన్నపేట గ్రామ సర్పంచ్ రుంకాణ అరుణ కలుగజేసుకుని అప్పటి వైసీపీ హయాంలో ఆయా పోస్టింగ్‌ను ఇచ్చారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సూపర్ వైజర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని అర్హతులు చూసే పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీడీవో కల్యాణి కలుగజేసుకొని రాజకీయలకు పోకుండా సమావేశం ముందుకు సాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరాగా వాగ్వాదం సద్దుమనిగింది. అనంతరం శాఖలవారిగా చర్చ జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలశాఖ అధికారులు, పాల్గొన్నారు.

అక్రమ లాకౌట్‌ను ఎత్తి వేయాలి

● ఉమా జూట్ మిల్లు కార్మికుల తీర్మానం



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘం నాయకులు

కొత్తవలస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని ఉమాజూట్ మిల్లుకు సంబంధించి యాజమాన్యం అక్రమంగా విధించిన లాకౌట్‌కు సంబంధించి ఈ నెల 19 వతేదీన విశాఖపట్టణం జేసీఎల్ వద్ద కన్సోలేషన్ మీటింగ్ ఉందని ఈ మిల్లు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా తెలిపారు. ఆదివారం కార్మిక సంఘం కార్యాలయంలో కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం గణేష్ పండా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి యాజమాన్యం తప్పనిసరిగా హాజరు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంవత్సరం జూలై 15 తేదీ నుంచి అక్రమ లాకౌట్ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే డీసీఎల్, జేసీఎల్ వద్ద 8 సార్లు సమావేశాన్ని నిర్వహించగా యాజమాన్యం ఒక్కసారి కూడా హాజరుకాలేదన్నారు. యాజమాన్యానికి కార్మిక శాఖాధికారులపై గౌరవం లేనప్పుడు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు కర్రు శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్. రాంబబాబు తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతి పార్టీకి తీరని లోటు

బాడంగి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు మృతి టీడీపీ పార్టీకి తీరనిలోటని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మంగళవారం బాడంగిలోని తెంటు బంగ్లాలో నివాళులుఅర్పించి మౌనం పాటించారు. ఆయనతోపాటు బుడా ఛైర్మన్ లక్ష్మంనాయుడు, పార్టీ ప్రెసిడెంట్ తెంటు రవి, బాడంగి సర్పంచ్ కండి రమేష్, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరి, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

లక్కవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మరణం పట్ల ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సంతాపం వ్యక్తం చేశారు. రామ్మూర్తినాయుడు పార్టీకి ఎనలేని సేవలు అందించారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శృంగవరపుకోట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1976 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, బొండ వెంకటరమణమూర్తి, వసంత వెంకటరమణ, జీఎస్ఎన్ ప్రసాద్, నానిగిరి తులసీదాస్, దొడ్డనారాయణరావు తదితరలతో అప్పట్లో కలిసి చదువుకున్నవారంతా ఒక చోట చేరి సందడి చేసారు. 50 ఏళ్ల తరువాత కలవడంతో ఎక్కడెక్కడ నుంచో వచ్చిన వారంతా పాత మిత్రులను చూసి సంతోషించారు. వీరికి అప్పట్లో చదువు చెప్పిన గురువులను సత్కరించారు. కళాశాలలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేశారు.

వాహనాల తనిఖీ

బొబ్బిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ ఎస్‌ఐలు జ్ఞానప్రసాద్, శ్రీహరి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు పాటించని వారిపై ఫైన్‌లు వేశారు.

పైసలు ఇవ్వనిదే పనిచేయరా ?

వంగర, నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): మండ లంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పైస లు ఇవ్వనిదే పత్రాలు ఇవ్వాలంటే అంటూ సభ్యు లు ధ్వజమెత్తారు. ఆదివా రం ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీపీ సురేస్ ముఖర్జీ అధ్యక్షతన మండ ల సమావేశం నిర్వహించారు. ముందుగా రెవెన్యూ శాఖపై జరిగిన సమీక్షలో వైస్ ఎంపీపీ కిమిడి ఉమాతో పాటు మద్దువలస సర్పంచ్ వెంకటరమణ, కొప్పర సర్పంచ్ సన్యాసినాయుడు ధ్వజమెత్తారు. రెవెన్యూ అధికారులు తమకు విలువ ఇవ్వటంలేదని ఎందుకు అలా వ్యవహరిస్తున్నారో చెప్పాలని పట్టుబట్టారు. దీంతో తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ రమణ ఇక ముందు అలా జరగకుండా చూస్తానన్నారు. తహసీల్దార్ ఎందుకు సభకు రాలేదని పలువురు ప్రశ్నించగా ఆయన మౌనం ప్రదర్శించారు. అనంతరం జరిగిన విద్యాశాఖపై చర్చలో ఎంఈవో దుర్గారావు మాట్లాడుతుండగా సభ్యులు వెంకటరమణ, రామకృష్ణ మద్దువలస, జగన్నాథవలస సంగాంలో స్కేవెంజర్, పలువురు వంట ఏజెన్సీలను ఎలా తొలగించారో చెప్పాలని ఎంఈవో దుర్గారావును నిలదీశారు. అక్కడ విద్యాకమిటీ తీర్మాణంతో తొలగించామని చెప్పటంతో విద్యాకమిటీ తీర్మాణం లేదని ఆ తీర్మాణం సబలో చూపాలని పట్టుబట్టారు. ఈ విషయంలో కోర్టుకు వెళతామని హెచ్చరించారు. ఏవో కన్నబాబుకు ఎంపీపీ సురేస్, ఏపీవో సత్యవతిని ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు పలువురు నిలదీశారు. పలు శాఖల అధికారులు సమావేశానికి దుమ్మాకొట్టటంతో వారిపై సభలో తీర్మానించి కలెక్టర్ కార్యాలయానికి చర్యల నిమిత్తం పంపుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవో త్రినాథ, వైస్ ఎంపీపీ ఉమా, సత్యంతో పాటు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

తెంటును సన్మానించిన బేబీనాయన



బుడా చైర్మన్‌గా ఎంపికైన తెంటు లక్ష్మంనాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుకు బొబ్బిలి అర్బన్ డవలప్‌మెంట్ ఛైర్మన్ పదవిని ఇటీవల టీడీపీ ప్రభుత్వం ప్రకటించడంతో ఆదివారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన బాడంగిలోని తెంటు నివాసానికి చేరుకుని సన్మానించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ టీడీపీకి మొదటి నుంచి తెంటు కుటుంబం విధేయులుగా ఉండడం ఆనవాయితీగా వస్తోందని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన విజయానికి అహర్నిశలు కృషి చేసిన లక్ష్మంనాయుడుకు ఈ పదవి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 27న బొబ్బిలిలో ప్రమాణస్వీకారానికి కూటమి తరపున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేరుకొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ ప్రెసిడెంట్ తెంటు రవి, బాడంగి సర్పంచ్ కండి రమేష్, పాలవలస గౌరి, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు లక్ష్మంనాయుడును సన్మానించారు.

అంతర్జాతీయ బాలల దినోత్సవం



బొబ్బిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ నిధి పాఠశాలలో ఆదివారం ఘనంగా వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు అనేక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. వాసు విద్యాసంస్థల అధినేత రౌతు రామ్మూర్తి, చోడిగంజి రమేష్‌నాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు సందేశమిచ్చారు. నేటి బాలలు అత్యంత చురుకైన వారని, చదువులో గాని, ఇతర సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలలో గాని తమ ప్రతిభను రుజువు చేసుకుంటున్నారన్నారు. ఆరోగ్యకరమైన పోటీతత్వంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రౌతు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

కవిగాయక సమ్మేళనం



విజయనగరం రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గురజాడ కేంద్ర గ్రంథాలయంలో కవిగాయక సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. చీకటి దివాకర్, చీకటి చంద్రికారాణి, మురళీకృష్ణ, పి.శ్రీనివాస్ తదితరులు ఈ కవిగాయక సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సమ్మేళనానికి నగరంలోని పలు సాహితీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రచయితలు, కవులు, గాయకులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం 'ముత్యాలవాన' బాల సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయిత వాసుదేవరావు గురించి, ఆ పుస్తకం గురించి రచయితలు, సాహితీవేత్తలు విశ్లేషణ చేశారు.

న్యూస్ బాక్స్

నేడు నగరపాలక సంస్థలో గ్రీవెన్స్

విజయనగరం రింగురోడ్డు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి సభ్యుని ఉప ఎన్నిక రద్దయినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించడంతో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ కార్యాలయంలో యధావిధిగా నిర్వహిస్తున్నట్టు కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో సమర్పించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎత్తిపోతల ప్రాజెక్టు మంజూరు చేయాలి

బాడంగి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): వాడాడ నుంచి కోడూరు వరకు ఎత్తిపోతల లిఫ్ట్ ప్రాజక్టు మంజూరు చేయాలని కోరుతూ బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మంనాయుడుకు రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అడ్డా గోవిందరాజు వినతి పత్రం అందజేశారు. ఈ ప్రాజెక్టు వల్ల 10 గ్రామాల సన్నకార రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరిపి శ్రీదేవి రమేష్, కోడూరు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు భోజన వితరణ

బొండపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంపల్లి గ్రామంలో గల బ్రైట్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ సొసైటీ అనాథ ఆశ్రమంలో 150 మంది పిల్లలకు భోజనాలను ఆదివారం మెంటాడ మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన గంట్రేడి రామునాయుడు, సురేష్ ఏర్పాటు చేశారు. వారి తండ్రి మాజీ గ్రామ సర్పంచ్ గంద్రేటి కారునాయుడు జ్ఞాపకార్థం ఈ భోజనాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఆశ్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'సేవలను గుర్తించండి'

లక్కవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 104 వాహనాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వారి ప్రయోజనాల కోసం ప్రయత్నించాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి సిబ్బంది వినతిపత్రం అందించారు. సుమారు 16 సంవత్సరాలుగా పనిచేస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

లక్కవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేసేందుకు విశ్వమంతా ట్రస్టు కృషి చేస్తుందని వ్యవస్థాపకులు మంథా లక్ష్మీ విశ్వేశ్వర శర్మ తెలిపారు. ఆదివారం కల్లేపల్లి-రేగ గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో క్వాంటమ్ ఆసుపత్రి సహకారంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. పేదలకు ఉచితంగా దుస్తులు, పండ్లు పంపిణీ, భోజన సదుపాయం కల్పించారు. మంథా రమేష్, విశ్వేశ్వరరావు, యడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బొబ్బిలి రూరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లి గ్రామంలో అన్నపూర్ణ అపన్న హస్తం సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డా. బొత్స కాశినాయుడు మనవరాలు బొత్స శ్రావ్యశ్రీ ఆదివారం ఆహారాన్ని పంపిణీ చేశారు. చెప్పులు, దుప్పట్లు, చేతి కర్రలు ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు బొంతలకోటి శంకరరావు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఆదివారం ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో నగర శివార్లలో జరిగిన కార్తీక వనమహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాచార శాఖ ఏడీ రమేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పీఎస్ఎస్వీ ప్రసాదరావు, అల్లు సూరిబాబు, కేజీ శర్మ, ఎంఎస్ఎన్ రాజు, పాత్రో, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో అయ్యప్ప పడిపూజ

శృంగవరపుకోట, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడి పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్బారావు శర్మ, శ్రీదారగంగమ్మ ఆలయ అర్చకులు రాజగోపాలాచారి ప్రత్యేక హోమాలు, అభిషేకాలు జరిపించారు. స్వాములకు భిక్షతో పాటు అన్నదానం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బొబ్బిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం రోజంతా ఆనందోబ్రహ్మ కళాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అంతర్జాతీయ బాలల దినోత్సవాల్లో భాగంగా సంస్థ అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 159 మంది విద్యార్థులు పాల్గొని జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు డ్యాన్స్‌లు చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబచిన వారికి మెడల్స్‌ను, ప్రోత్సాహక బహుమతులను కళాభారతి ప్రతినిధులు నంబియార్ వేణుగోపాలరావు, డాక్టర్ చింతా శారద చేతుల మీదుగా అందజేశారు. న్యాయనిర్ణేతలుగా జి.కొండలరావు, వై.వాగ్దేవి, లావణ్య వ్యవహరించారు. ఆనందోబ్రహ్మ ప్రతినిధులు గంగాధర్, రామ్మూర్తి, భవాని, కమల్‌కుమార్, సత్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బ్రాండ్ రైస్ బస్తాలు స్వాధీనం



పట్టుబడ్డ నకిలీ బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరేష్

విజయనగరం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నకిలీ బ్రాండ్ రైస్ బ్యాగులతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఈ నెల 15న లలితా రైస్ సేల్స్‌మెన్ భగవాన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పీడబ్ల్యూ మార్కెట్‌లోని జయలక్ష్మీ ట్రేడర్స్‌లో తనిఖీలు చేపట్టగా, నకిలీ బ్రాండ్ రైసు బ్యాగులు పట్టుబడ్డాయని తెలిపారు. జయలక్ష్మీ ట్రేడర్స్ యజమాని పెంటపాటి ఈశ్వరవెంకట రెడ్డి అలియాస్ రాజా హైదరాబాదులోని పద్మావతి పోలీయాక్స్ అనే షాపు నుంచి బ్రాండెడ్ గోనెలైన అక్షయ్, సమీరా, లలితా కొనుగోలు చేసి, తక్కువ ఖరీదైన బియ్యాన్ని ఈ బ్యాగుల్లో నింపి వ్యాపారం చేస్తూ, ప్రజలను మోసం చేస్తున్నాడు. ఇతని వద్ద నుంచి 640 నకిలీ బ్రాండెడ్ రైసు బ్యాగులను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం జిల్లా రైస్‌మార్కెటింగ్ మేనేజర్‌కి అప్పగించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని కణపాకలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంటు ఎస్‌ఐ రాజశ్రీ తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించి, మద్యం విక్రయిస్తున్న నారాయణరావును అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు నిమిత్తం విజయనగరం సర్కిల్-1 టౌన్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, పీసీలు ప్రసాద్, నాయుడు, ప్రదీప్‌లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరం క్రైం, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి): విజయనగరం రైల్వే స్టేషన్ గొట్లాం రైల్వే స్టేషన్ మధ్యలో ఉన్న ద్వారపూడి గ్రామ శివార్లలో రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ బాలాజీరావు ఆదివారం తెలిపారు. వయస్సు 20 నుంచి 25 సంవత్సరాలు కలిగి, గ్రే కలర్ టీ షర్టు, బ్లూకలర్ షార్ట్ ధరించినట్టు తెలిపారు. జీఆర్‌పీ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రిలోని మార్చురీ గదికి తరలించినట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 17089 నెంబరును సంప్రదించాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొబ్బిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అప్పయ్యపేట శివారు రాణి గారితోటలో పేకాట ఆడుతుండగా 14 మంది పట్టుబడినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేశామని, పేకాడుతున్న 14 మందిని పట్టుకుని వారి నుంచి రూ.30,400/-, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగితే చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణికి పాల్పడినా, భూదురాక్రమణకు పాల్పడినా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ, సమాజానికి ప్రమాదకరంగా మారితే, ఎంతటి వారినైనా ఉపేక్షేంచేది లేదని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తున్న టూటౌన్ పరిధిలోని బండి రాజీవ్ అలియాస్ డాడీపై పీడీ యాక్టు ప్రయోగించినట్టు తెలిపారు. మూడేళ్లలో 12 కేసుల్లో అరెస్టు అయిన నిందితుడ్ని నిర్బంధించాలని కలెక్టరు బీఆర్ అంబేద్కర్‌కు జిల్లా పోలీసుశాఖ ప్రతిపాదనలు పంపగా, వాటిని సిఫార్సు చేస్తూ కలెక్టరు అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిందితుడు బండి సంజయ్ సమాజానికి ప్రమాదకరంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తిగా మారుతున్నాడని భావించి విశాఖపట్టణం సెంట్రల్ జైలుకి తరలించాలని కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వన్‌టౌన్, టూటౌన్, విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో 12 కేసుల్లో నిందితుడిగా బండి సంజయ్ అరెస్టు అయ్యారన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

శాంతియుత పోరాటాన్ని అరెస్టులతో ఆపలేరు

వేపాడ, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం చేపట్టే శాంతియుత పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులతో నిలవరింప చేయాలను కోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం అధ్యక్షడు గట్టు వెంకన్న ఆందోళన వ్యక్తం చేసారు.గ్రామ రెవిన్యూ అధికారులకు నిబంధలకు విరుద్ధంగా రెవిన్యూ అధికారులు వేస్తున్న నైట్ డ్యూటీలు,ఇసుక ర్యాంపులు,రైస్ మిల్లుల డ్యూటీలు రద్దు చేయాలని,గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సంఘం సారద్యంలో 18న చేపట్ట నున్న సీసీఎల్ఏ రాయబార కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టినట్టు ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుత పద్ధతిలో చేపట్టే రాయబార కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు, అరెస్టులు శుక్రవారం సాయింత్రం నుంచి పాల్పడడం ఘోరమన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వహిస్తే పోరాటానికి సిద్ధం కావాలని గ్రామ రెవిన్యూ సభ్యులకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు,తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గమైన చర్య

రాజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడం చాలా దుర్మార్గమైన చర్య అని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మీనాయుడు ఆరోపించారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడితే అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడారని, నేడు అది మరిచిపోయి కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై భారం ఘోరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఈ స్మాట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించారని, హైకోర్టులో కేసులు వేశారని, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత ఇటువంటి చర్యలకు పాల్పడటం తగదన్నారు. ఇప్పుడు ఎవరి ఒత్తిడితో ఈ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బూత్ కమిటీల నియామకానికి చర్యలు

వేపాడ, నవంబరు 17: మండలంలోని 59 బూత్‌లకు కమిటీల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్టు బీజేపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనుష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లంపూడి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎల్.పవన్‌కుమార్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. దీనిలో బూత్ కమిటీల నియామకంపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెట్‌కు జనసేన ఎన్ఆర్ఐ వితరణ

బొబ్బిలి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెట్ శనపతి అశోక్‌కు జనసేన ఎన్ఆర్ఐ ప్రతినిధులు క్రీడాకిట్‌ను వితరణగా అందజేశారు. స్థానిక జనసైనికుల నిలయంలో ఆదివారం రాష్ట్ర జనసేన కార్యనిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు చేతులమీదుగా స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. రామభద్రపురం మండలం ముచ్చెర్లవలస గ్రామానికి చెందిన అశోక్ రాష్ట్ర, జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలలో పాల్గొని బంగారు, కాంస్య పతకాలను సాధించాడు. యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఎన్ఆర్ఐ జనసేన మిత్రులు అనిల్ అన్నూరు, గోపి భూషణ్, శ్రీనివాస్ మాతిలు పాలూరు బాబు ద్వారా ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు సతీష్, జగదీశ్, యుగంధర్, వీరమహిళ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కమలానంద భారతస్వామికి ఘన స్వాగతం



కమలానంద భారత స్వామికి ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

బొబ్బిలి నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలికి ఆదివారం సాయంత్రం విచ్చేసిన విజయవాడ శ్రీభువనేశ్వరిదేవి పీఠాధిపతి శ్రీకమలానంద భారతస్వామికి భక్తులు ఘన స్వాగతం పలికారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు ఆధ్వర్యంలో పలువురు భక్తులు స్థానిక రైల్వేస్టేషన్ నుంచి ఊరేగింపుగా శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆయన ఆధ్యాత్మికాంశాలను బోధించారు. ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు స్థానిక రాజా కళాశాల మైదానంలో ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి హిందూ ధార్మిక ప్రవచనాలు స్వామి ఇస్తారని స్వామినాయుడు తెలిపారు.

శిథిలమైనా తొలగించరా?

- ప్రమాదకరంగా ప్రభుత్వ పాత భవనాలు
- పొంచి ఉన్న ప్రమాదం
- చర్యలు తీసుకోని అధికారులు

వీరఘట్టం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. గంగంపేటలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరింది. వీరఘట్టం పీహెచ్‌సీ పాత భవనంపైన మొక్కలు మొలిచి వనంలా తయారయ్యింది. అలాగే మండల విద్యాశాఖ కార్యాలయం పాత భవనం గోడలు బీటలు వారి ఏ క్షణంలో కూలుతుందో అని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన జీటీడబ్ల్యుఎస్ పాఠశాల భవనం


వీరఘట్టం పీహెచ్‌సీ పాత భవనం ఇలా..


బీటలు వారిన ఎంఈవో కార్యాలయ పాత భవనం

పెంకిటిల్లు దగ్ధం

మక్కువ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో పెంకిటిల్లు దగ్ధమైన ఘటన స్థానిక మజ్జివీధిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల మేరకు.. మజ్జి వీధికి చెందిన కొవ్వాడ వెంకటరమణ, వరలక్ష్మీ దంపతులు పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. వారు వెళ్లిన కాసేపటిలోనే అగ్నికీలలు ఎగిసిపడి పెంకిటిళ్లు దగ్ధమయ్యింది. కలపతో కూడిన అటుకులు ఉండడంతో మంటల తీవ్రత పెరిగింది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా వీలు లేకుండాపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఇంటిలో ఉన్న ఫ్రిడ్జ్, కంప్రెసర్ పేలిపోడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇంటిలో ఉన్న రూ.3లక్షల 50వేల నగదు, ఆరు తులాల బంగారం, ఫర్నీచర్, పిల్లల సర్టిఫికెట్లు, బాండ్లు ముఖ్యమైన సామగ్రి పూర్తిగా కాలిపోడడంతో బాధితులు బోరున విలపిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆస్తినష్టం అంచనా వేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విజ్ఞానంతోనే సమాజ వికాసం

గరుగుబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతోనే సమాజం వికసిస్తోందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు డా.డి.పారినాయుడు అన్నారు. ఆదివారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయం పరిధిలోని గరిమెళ్ల నారాయణ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు టి.శివకేశవరావు పాల్గొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానాలు తెలిపే పలు రకాల పుస్తకాలను పంపిణీ చేశారు. బడి తోటలు నిర్వహిస్తున్న ఉత్తమ కార్యకర్తలకు జ్ఞాపికలను అందించారు. సీతంపేట డివిజన్ ప్రకృతి సిబ్బంది గిరిజన ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు

గరుగుబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం పరిధిలో ఆదివారం విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ఆవరణలో గ్రంథాలయాల విశిష్టతతో పాటు పలు అంశాలపై నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటరత్నం, లైబ్రేరియన్ కె.మాధవి, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

సీతంపేట రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారి బి.గణేష్, హెచ్‌ఎం వై.హేమసుందర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. యువతపై మాదకద్రవ్యాల ప్రభావం ఎలా ఉంది అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

పాలకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆయన పట్టణంలోని దుకాణాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశారు.

వాగ్దానాలు నెరవేర్చాలి

సాలూరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు డిమాండ్ చేశారు. ఆదివారం సాలూరులో సీపీఎం పట్టణ రెండో మహాసభను నిర్వహించారు. పార్టీ నాయకులు శంకరరావు, ఇందు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మన్యం జిల్లాలో మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలన్నారు. బ్యాక్‌లాగ్ డీఎస్సీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎన్వై నాయుడు, వెంకటరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల నిర్బంధం తగదు

పాలకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలపై అక్రమ నిర్బంధం ఆపాలని ప్రజా సంఘాల నాయకులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అన్నారు. వారు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 18న సీసీఎల్‌ఏ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం నిర్బంధాన్ని ఖండిస్తున్నామన్నారు. మంగళగిరి సీసీఎల్‌కు సామూహిక రాయభారం కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం స్థానిక తహసీల్దార్లు, పోలీసులు వీఆర్‌ఏ నాయకులకు అరెస్టులు చేస్తామని బెదిరించడం తగదన్నారు. ప్రభుత్వం వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

సాయిబాబా జయంతి ఉత్సవాలు ప్రారంభం

గరివిడి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గరివిడి టీచర్స్ కాలనీ లో ఉన్న సాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి సాయి బాబా జయంతి వారోత్సవాలు ప్రారంభమ య్యాయి. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 23వ తేదీ వరకు వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

పార్వతీపురాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చి దిద్దాలి

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పార్వతీపురాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంపై జిల్లా అధికారులతో ఆయన ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతకు మారుపేరుగా పార్వతీపురం నిలవాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త నుంచి సంపదను సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. రహదారులు, పార్కులు, విద్యుత్, ట్రాఫిక్ తదితర రంగాల ను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. చుట్టూ పచ్చదనం కనిపించేలా మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం

నెల్లిమర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణం తీవ్ర విచారకరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

● గుమ్మలక్ష్మీపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు మృతికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సంతాపం తెలిపారు. ఆమె ఆదివారం ఒక ప్రకటనలో వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతానగరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుభద్ర సీతారాంపురంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై ఆదివారం దాడి చేసి, మహిళను అదుపులోకి తీసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ సీఐ డి.పద్మావతి తెలిపారు. ఈమేరకు 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ● మెంటాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇప్పలవలస గ్రామానికి చెందిన మహిళ నుంచి ఆదివారం 28 మద్యం సీసాలు స్వాధీన చేసుకున్నట్టు ఆంధ్ర ఎస్‌ఐ సీతారాం చెప్పారు. స్వగ్రామానికి మద్యం తరలిస్తున్నండగా అమరాయవలస జయతి వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎయిమ్స్ ఫలితాల్లో లిఖిత ప్రతిభ

పాలకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించి ఐఎస్‌ఐ-సీఈటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో పట్టణంలోని వేమకోటివారివీధికి చెందిన బంకురు లిఖిత ఆల్ ఇండియా 335 ర్యాంకు సాధించారు. లిఖిత తండ్రి శ్రీనివాసరావు వ్యాపారవేత్త కాగా, తల్లి పద్మావతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పాలకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలకొండ మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఇద్దరు టీడీపీ సభ్యులు, ఎంపీపీ బొమ్మాళి భాను మాత్రమే హాజరయ్యారు. నిబంధనల మేరకు కనీసం ఐదుగురు సభ్యులు హాజరు కావాలని, ఈ మేరకు ఈ సమావేశాన్ని ఈనెల 18కు వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీవో వీవీ రంగారావు తెలిపారు. వైసీపీ ఎంపీటీసీలు హాజరుకాకపోవడంపై తంపటాపల్లి వైస్ సర్పంచ్ జాడ శ్రీధర్, టీడీపీ నాయకుడు కర్నేన అప్పలనాయుడు ఆక్షేపించారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

గుర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి రాజేష్‌వర్మ తెలిపారు. పల్లిగండ్రేడు గ్రామంలో ఆయన ఆదివారం మాట్లాడారు. బీజేపీకి అందరూ సహకరించి సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు.

పోరాటం తప్పదు

పార్వతీపురటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, వ్యవసాయ, కార్మిక గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ బి.దాసు, ఏపీ రైతు సంఘం నాయకుడు బి.అప్పలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఏపీ రైతు కూలీ సంఘ భవనంలో రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేబరు కోడ్‌లను రద్దు చేసి, కనీస వేతనాలను ఇవ్వాలన్నారు. ఈనెల 24వ తేదీన పాలకొండ నుంచి వీరఘట్టాం, జియ్యమ్మవలస, మేరంగి, ఖడ్గవలస, పార్వతీపురం మీదుగా సీతానగరం వరకు బైకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. 26వ తేదీన జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన ర్యాలీలో కార్మిక, రైతులతో పాటు ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయుడు, వై.మన్మథరావు, జీవ, గంగునాయుడు, పి.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహించాలి

వీరఘట్టం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గత సంవత్సరం ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సంవత్సరం అలా జరగకుండా ఏవో సౌజన్య దృష్టికి తీసుకొచ్చారు. ఈనెల 20 నుంచి కొనుగోలు ప్రారంభిస్తామని ఏవో తెలిపారు. రైతులు మండలంలోని మూడు రైస్‌మిల్లుల్లో వారికి ఇష్టమైన మిల్లులో విక్రయించుకోవచ్చునని చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న జలజీవన్ మిషన పనులు పూర్తి చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు పి.విజయకుమారి, వి.భార్గవ్, ఎంపీడీవో బి.వెంకటరమన, వివిధ శాఖల అధికారుల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కుప్పలుగా ప్లాస్టిక్ గ్లాసులు

పూసపాటిరేగ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్నడూలేని విధంగా కొప్పెర్ల పంచాయితీలోగల కొత్త కొప్పెర్ల వద్ద రెండు మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీటి చుట్టూ ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ పాకెట్ల కుప్పలుగా పేరుకుపో తున్నాయి. దీనిస్థానంలో పేపర్ గ్లాసులు వినియోగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కొప్పెర్లలో మద్యం దుకాణంవద్ద కుప్పలుగా పడిఉన్న ప్లాస్టిక్ గ్లాసులు

ఆటలతో మానసిక వికాసం

● ఉత్సాహంగా జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు

పార్వతీపురంటౌన్/ బెలగాం, నవంబరు 17: ఆటలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డా.ఎం.శ్రీరాములు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఎన్.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శ్రీచెస్ అకాడమీ ఆధ్వర్యంలో మన్యం జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు నిర్వహించారు. 11 పాఠశా లల నుంచి 70 మంది అండర్ 8, 10, 12, 14, 16 విభాగాల నుంచి బాల, బాలికలు పోటీల్లో పాల్గొన్నారని నిర్వహకులు తెలిపారు. అనంతరం విజేతల కు బహుమతులు అందజేశారు. విజేతలను త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకు వెళ్లనున్నట్టు పోటీల సమన్వయకర్త జేవీ తిరుమలాచార్యులు తెలిపారు.


చెస్ పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

గ్రామ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి

చీపురుపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేస్తు న్న ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తాగు నీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, వాల్టా చట్టం అమలు తదితర అంశాలపై ప్రతిపాదనలు చేయాల న్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ వంటి పనులు గ్రామ ప్రణాళికలో ఉండాలని తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతంపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌ఐ అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాలకొండ-హడ్డుబంగి రహదారిలోని కిట్టాలపాడు జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మితి మీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడిపే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో విధులకు హాజరు కావాలి

పాలకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలని డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక డిపోలో ఉద్యోగులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 16వ తేదీ నుంచి డిసెంబరు 15 వరకు సమయపాలన మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, ఏఎంఎఫ్ జగన్నాథం, బీకే మూర్తి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

నెల్లిమర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండపేట శివారు ప్రాంతంలోనూ, మండలంలోని ఒమ్మి గ్రామ శివారులోనూ నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఆదివారం దాడులు నిర్వహించినట్టు ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు. కొండపేట సమీపంలో 11 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.5,010, ఒమ్మి సమీపంలో ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.4070 స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. గ్రామాల్లో గానీ, శివారు ప్రాంతాల్లో గానీ జూదం ఆడుతున్నట్లు తెలిస్తే తమ నెంబరు 9121109444కు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

ఆలయాల నిర్వహణలో హిందువులే ఉండాలి

డెంకాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాలయాల నిర్వహణలో హిందువులనే నియమించాలని బీజేపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బూర్లె శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర దేవాలయంలో అర్చకుడు జగన్నాథం ఆధ్వర్యంలో ఆదివారం హైందవ శంఖారావం బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో జనవరి 5వ తేదీన నిర్వహించనున్న హైందవ శంఖారావానికి ప్రతిఒక్కరూ తరలి రావాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డెంకాడ అయ్యప్ప సేవా పీఠం గురుస్వామి గేదెల వెంకటరమణ, శివయ్య సేవా పీఠం గురుస్వామి చందక రమేష్ బాబు, విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుషిణి గ్రామంలో ప్రభుత్వ భూములను, బంజరు భూములను, గెడ్డలను ఆక్రమించుకుని అనుమతులు లేకుండా బోర్లు తవ్వి సాగు చేసుకుంటున్న వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన దళితుడు కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల తహసీల్దార్ సుదర్శనరావుకు వినతిపత్రం అందజేసినట్టు ఆయన ఆదివారం విలేకర్లకు తెలిపారు. గ్రామ పరిధిలో ఆక్రమణలు జరిగినట్టు చెప్పారు. రెవెన్యూ అధికారులు తక్షణమే విచారణ చేసి, ప్రభుత్వ భూమిని కాపాడాలని, ఆక్రమణదారులను శిక్షించాలని ఆయన కోరారు.

జనసేనలో చేరిక

చీపురుపల్లి/గుర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలంలోని కలవచర్ల గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరాయి. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన పల్లె సత్యనారాయణ, కూర్మారావు, సంతోష్ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కోట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఇన్‌చార్జి శ్రీనివాసరావు